# త్వరలో గ్రూప్ 2 అనుబంధ నోటిఫికేషన్

- కసరత్తు చేస్తున్న టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిరుద్యోగులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్న గ్రూప్-2 పోస్టుల భర్తీకి అనుబంధ నోటిఫికేషన్ విడుదల చేయడానికి టీఎస్‌పీఎస్సీ కసరత్తు చేస్తున్నది. 593 పోస్టుల భర్తీ కోసం టీఎస్‌పీఎస్సీకి అనుమతిస్తూ ఈ నెల 23న ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పోస్టుల భర్తీకి అంతర్గత ప్రక్రియను పూర్తి చేయడానికి కమిషన్ సిద్ధమవుతున్నది. గతంలో దరఖాస్తు చేసుకొన్నవారికి తోడుగా ఇప్పుడు కొత్త వారికి కూడా అవకాశం ఇస్తారు. ఈ పరీక్షలు రాయడానికి ఇదివరలో నిర్దేశించిన గరిష్ఠ వయోపరిమితికి ఇచ్చిన మరో పదేండ్ల మినహాయింపును ఇంకో ఏడాది కూడా కొనసాగిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం రెండురోజుల క్రితం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరికొందరు నిరుద్యోగులు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉంది. గ్రూప్-2 కోసం ఇప్పటికే దాదాపు ఆరు లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. త్వరలో విడుదల చేసే నోటిఫికేషన్ కోసం కూడా చాలామంది ఎదురుచూస్తున్నారు. గతంలో పరీక్షకు సన్నద్ధం కావడానికి మరికొంత సమయం కావాలని నిరుద్యోగ యువత, ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేయడంతో ప్రభుత్వం ఏప్రిల్ 24, 25 తేదీల్లో జరగాల్సిన పరీక్షను వాయిదా వేసింది. తాజా పరీక్ష తేదీలపై త్వరలో విడుదలయ్యే అనుబంధ నోటిఫికేషన్‌తో స్పష్టత రానుంది. దీంతోపాటు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన గురుకుల టీచర్ పోస్టుల భర్తీకి వచ్చే నెలలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.